బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



బండమైసమ్మనగర్‌లో బడిబాటలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

కవాడిగూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని అంగన్‌వాడీ టీచర్లు జె.స్వప్న, శారద సూచించారు. బుధవారం కవాడిగూడ బండమైసమ్మనగర్ 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడీడు పిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేని నిరుపేద తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడంతోపాటు ఐదేళ్లు దాటిన వారిని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధనలు అందిస్తున్న ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా మీనాక్షి, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలగూడ ఎంఎస్‌హెచ్ కాలనీలో ..

దోమలగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో అంగన్‌వాడీ టీచర్లు, అప్సా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బడిబాటను నిర్వహించారు. అప్సాస్వచ్ఛంద సంస్థ, మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీటీచర్లు బడిబాటను ఎంసీహెచ్ కాలనీలోని రెండు అంగన్‌వాడీ సెంటర్‌లోని పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్‌లు పుష్పలీల, సరిత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, బాలమృతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్సా స్వచ్ఛంద సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ బొట్టు రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు అందజేసేందుకు సిద్ధం

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యామండలి పరిధిలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 22 ప్రాథమిక పాఠశాలలు, 13 ఎయిడెడ్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు.

పునఃప్రారంభంరోజు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు

ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 1, 2 సెక్టన్ పరిధిలో గల విద్యార్థులకు స్కూల్‌కు వచ్చిన మొదటి రోజే స్కూల్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం మొదటి విడత పుస్తకాలు, దుస్తులను విద్యామండలికి అందజేసింది. మొదటి విడత విద్యార్థులకు 1961 యూనిఫాంలు (ఒక్కొక్కరికి ఒక్క డ్రస్), 70777 పాఠ్యపుస్తలు మండలానికి వచ్చాయి. వీటితోపాటు నోటుపుస్తకాలు సైతం వచ్చాయని ఉపాధ్యాయులు తెలిపారు.



ముషీరాబాద్ పాఠశాలలో స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలతో ఉపాధ్యాయులు

పంపిణీకి ఎమ్మెల్యే గోపాల్ హాజరు

పాఠశాలల పునఃప్రారంభం రోజు ఎమ్మెల్యే ముఠా గోపాల్, విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేయనున్నారు. గురువారం పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంలా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. తరగతి గదులకు పూలదండలు, తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికే విధంగా పనులు ప్రారంభించారు.

ఈ విద్యాసంవత్సరం బాలురకు ప్యాంట్లు...

ప్రభుత్వపాఠశాలల్లో చదివే 6, 7వ తరగతుల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంగా ప్యాంట్లను అందజేయనున్నారు. గతంలో ఈ తరగతుల విద్యార్థులకు నిక్కర్‌లు ఇవ్వగా ఈ విద్యాసంవత్సరం నుంచి మార్పు చేశారు. 6, 7వ తరగతి విద్యార్థినులకు చూడీదార్ యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పండుగలా ప్రారంభం



గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో పండుగ వాతావరణం ఉట్టిపడేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు తరగతిగదులకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాం. మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు అందజేస్తాం.

- స్వరూపారాణి, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్

కవేలిగ్రౌండ్‌లో ప్రాథమిక పాఠశాల రెడీ



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానుండడంతో గాంధీనగర్ డివిజన్‌జవహర్‌నగర్ కవేలిగ్రౌండ్‌లోని ప్రభుత్వప్రాథమిక పాఠశాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సిబ్బంది శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణలో నీట్‌గా ఊడ్చారు. పాఠశాల భవనం చుట్టూ పాఠశాల హెడ్‌మాస్టర్ మేడే దేవదాసు పూలమొక్కల లాన్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన గడ్డెను కడిగించారు. టాయ్‌లెట్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. కాగా టాయ్‌లెట్ పనులు మరికొద్ది రోజుల్లో పూర్తవుతాయని దేవదాసు వివరించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బడిబాటలో పాల్గొన్న కార్పొరేటర్ పావనివినయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యార్థులుగా చక్కటి ప్రమాణాలతో కూడిన జీవనాన్ని కొనసాగించడానికి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. డివిజన్‌లోని జవహర్‌నగర్ కవేలిగ్రౌండ్‌లోని ప్రాథమిక పాఠశాల యాజమాన్యం బుధవారం ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పావనివినయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకు మించి ఫీజుల వసూళ్లు తల్లిదండ్రులకు పెనుభారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేడే దేవదాసు, టీచర్లు శోభారాణి, సునీత, మెరిలా, ప్రవళిక, నాగరాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, పార్టీ నాయకులు విజయలక్ష్మి, ఆనంద్‌రావు, నీరజ్, సూరజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యానగర్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నల్లకుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్‌పర్సన్ సీత దయాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. డివిజన్‌లోని రత్నానగర్, సత్యానగర్, శివానందనగర్, నర్సింహబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆమె పరిశీలించారు. చిన్నారుల పౌష్టికాహారం, వారి రక్షణ ఇతరత్ర అంశాలను సభ్యులు, బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు బి.వచన్‌కుమార్, ప్రముఖ న్యాయవాది ఎన్‌ఈ.మహేందర్, రత్నానగర్, సత్యానగర్ అంగన్‌వాడీ టీచర్లు మంజుల, ప్రతిభ, కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్, సీనియర్ నాయకులు కేపీ.మురళీకృష్ణ, ధన్‌రాజ్‌యాదవ్, రత్నానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎంబీ.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా డాక్టర్ అడమ్‌రాజ్

నల్లకుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ అడమ్‌రాజ్ డెక్కపాటి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలో డాక్టర్ అడమ్‌రాజ్ డెక్కపాటి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా అంకితభావంతో పార్టీ పటిష్టత కోసం పనిచేసిన తనకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

'బీసీ గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలి'

నల్లకుంట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ గురుకుల పాఠశాలల సెక్రటరీ సైదులును కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజయ్ ఘనాటే, ఎనుగంటి రాజునేత, శరత్ ఠాకూర్, వెంకటేష్, శంకరోళ్ల రవి, రాజుయాదవ్, జి.మల్లేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట సర్కిల్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బర్కత్‌పుర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఈ నెలాఖారు వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. బుధవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్, ఎస్వీఎస్ ఆస్పత్రి వద్ద ఈ స్పెషల్ డ్రైవ్‌ను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి అయన ప్రారంభించి మాట్లాడారు. కాచిగూడ డివిజన్‌లో శుక్రవారం వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని 200 మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది మట్టి, చెత్త కుప్పలు, చెట్ల కొమ్మలను తొలగించి శుభ్రం చేస్తారని తెలిపారు. అన్ని బస్తీలలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు తిరుపతి నాయక్, విజయ, ఎం.నర్సింగ్‌రావు, వాసు, భీమ్‌రాజ్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముజాహిద్ అలీఖాన్

బర్కత్‌పుర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంబర్‌పేట నియోజకవర్గం బర్కత్‌పురకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ముజాహిద్ అలీఖాన్ నియమితులయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

'ప్రోత్సాహాన్నిచ్చేవి పురస్కారాలు'

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు ప్రోత్సాహాన్నిస్తాయని దక్షిణ మధ్య రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రతిభకు పట్టాభిషేకం పేరిట సాంస్కృతికరత్న పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సంగీత కళాకారిణి రామరాజు లక్ష్మీశ్రీనివాస్(గుంటూరు), సాహితీవేత్త సయ్యద్ జానీబాషా(గుంటూరు), నాట్యకళాకారిణి యం. సాయిసుప్రియ(విశాఖపట్నం)కు పురస్కారాలను రామకృష్ణ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డా.రామరాజు శ్రీనివాసరావు, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కళాపోషకులు వడ్లకొండ వెంకటరావు, తెలుగు భాషాప్రచారకర్త విశ్వైలజ, కవయిత్రి టీవీ.శిరీష, వ్యాఖ్యాత్రి పద్మశ్రీలత, సంస్థ ప్రధానకార్యదర్శి వీవీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీకి మోసం.. భవనం సీజ్

రాంనగర్, ఆంధ్రజ్యోతి: వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌లో ఆస్తి పన్నుకు సంబంధించిన చెక్కును ఇచ్చి బౌన్స్ చేసి, జీహెచ్‌ఎంసీని మోసం చేసిన అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని 3-6-307/ఎ/2 భవనాన్ని బుధవారం డీఎంసీ మారుతిదివాకర్ సీజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్డులో వాణిజ్య భవనం సీజ్..!

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నివాసయోగ్య పత్రం(ఓసీ) లేకుండా వాణిజ్య కార్యకలాపాలు సాగుతోన్న ఓ వాణిజ్య భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. బుధవారం భవనాన్ని పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్లు భార్గవి, రామిశెట్టి దేవేందర్ పరిశీలించారు. మూడు సెల్లార్లు, గ్రౌండ్ ప్లస్ ఐదంతస్తుల వాణిజ్య భవనం/మల్టీప్లెక్స్ కోసం టీ వినయ్‌కుమార్, ఇతరుల పేరిట అనుమతి తీసుకున్నారు. నిర్మాణ పనులు జరుగుతుండగానే భవన యజమాని పలు వాణిజ్య సంస్థలతో లీజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కొన్నాళ్ల కిందట ఓ షాపింగ్ మాల్ ప్రారంభం కాగా.. పై అంతస్తులను మల్టీప్లెక్స్ పనులు జరుగుతున్నాయి. భవనం పూర్తవకుండా, ఓసీ తీసుకోకుండా కార్యకలాపాలు సాగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీ చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు భవనాన్ని సీజ్ చేశారు.

అక్రమ నిర్మాణంపై చర్యల కోసం ధర్నా

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బ్రహ్మంగారి దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నూతన భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని రాంనగర్ దళిత జాతీయ సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత జాతీయ సంఘం అధ్యక్షుడు సునీల్, సంఘం నాయకులు సదానంద్, భాస్కర్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల భవనం నిర్మించడంతోపాటు సెట్ బ్యాక్ లేకుండా పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. భవనం ఆనుకుని 3ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫారం, విద్యుత్ తీగలు సైతం ఉన్నాయని తెలిపారు. వీటివల్ల భవిష్యత్‌లో కాలనీవాసులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ ధర్నాలో రాంనగర్ దళిత జాతీయ సంఘం నాయకులు మహేష్, దర్శన్, శ్రీకాంత్, పవన్, రమేష్, బ్రహ్మం, ప్రమీల, రేణుక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

2020 భారత విద్యారంగంలో ఒక విప్లవాత్మకం



ప్రొ.వీఎస్.ప్రసాద్‌ను సత్కరించిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ప్రొ.లింబాద్రీ, డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ తదితరులు

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం 2020 భారత విద్యారంగంలో ఒక విప్లవాత్మక దశగా అభివృద్ధి చెందిందని, అందులో భాగంగా ఐడీపీ ప్రతి విద్యా సంస్థకు ఒక దిశానిర్దేశక పథకంగా ఉపయోగపడేలా రూపొందించబడిందని ప్రముఖ విద్యావేత్త, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఐడీపీ ద్వారా విద్యా సంస్థలు తమ బలాబలాలు అవకాశాలు, మార్గసూచక లక్ష్యాలను గుర్తించి, విద్యా నాణ్యతను మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సీఈవో ప్రొ.లింబాద్రీ, డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ, ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయంగా దెబ్బతీసేందుకు కేసీఆర్‌పై కుట్రలు



బీఆర్‌కే భవన్‌కు తరలివెళ్తున్న ఎమ్మెల్యే గోపాల్, అరుణశ్రీ తదితరులు

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం శశ్యశామలం కావాలని కాళేశ్వరంప్రాజెక్టును నిర్మించి, 40లక్షల ఎకరాల భూమికి నీళ్లు అందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. జస్టిస్ ఘోష్‌తో విచారణ జరిపించి, తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసారని అన్నారు. బుధవారం కేసీఆర్‌ను జస్టిస్ ఘోష్ విచారించేందుకు వెళ్తుండడంతో భోలక్‌పూర్ డివిజన్‌లోని ఎస్‌బీఐ కాలనీ నుంచి డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ విషప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ పేరును మరిచే విధంగా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, సోషల్‌మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం చౌరస్తా నుంచి డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, సుధాకర్ గుప్తా, టెంట్‌హౌస్ శ్రీనివాస్, పార్టీ నాయకులు భల్వంత్, సత్యనారాయణ బాబు, జావిద్‌ఖాన్ తదితరులు

కేసీఆర్‌కు మద్దతుగా తరలిన ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌కె భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ ఎదుట హాజరైన మాజీ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా గాంధీనగర్ డివిజన్ నుంచి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాకేశ్, పోతుల శ్రీకాంత్, అరుణశ్రీ, పున్న సత్యనారాయణ, పాశం రవి, విఠల్, శివకుమారి తదితరులు తరలివెళ్లారు.

విద్యతోపాటు క్రీడలపై దృష్టిసారించాలి

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టిసారించాలని తెలంగాణ తైక్వాండో అకాడమీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్ట ఎంసీహెచ్ కాలనీలో సాయిరక్ష తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు కలర్ బెల్టులు, సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం సీనియర్ తైక్వాండో కోచ్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బెల్టులు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు రాకేష్‌కుమార్, ఆకాష్, విష్ణు, జయేంద్ర, సహస్ర, వైష్ణవి పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

ఆర్టీసీ బస్‌భవన్ వద్ద సీపీఎం, ఏఐడీఎస్‌వో, ఏబీవీపీ ధర్నా

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన బస్‌పాస్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి బస్‌భవన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, మహేందర్, ఎం.శ్రీనివాసరావు, కుమారస్వామి, నరేష్, కిరణ్, అశోక్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బస్‌భవన్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఈడీ మునిస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.నాగరాజు, నాయకులు రాజశేఖర్, నితిష్, వినోద్, నాగరాజు, ప్రణీత్, ప్రణవ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

- పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కార్యదర్శి పృథ్వీతేజ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హరిప్రసాద్, అక్షిత, శివశంకర్, రేవంత్, హరీష్, ఆకాష్, చరణ్, యోగేష్, కిషోర్, మహేష్, మణిదీప్ పాల్గొన్నారు.

ఏడాది టైమ్ ఇవ్వండి

- మున్సిపల్ అధికారులు,
- కార్పొరేటర్‌తో మార్కెట్ షాపుల యజమానులు

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నూతన భవన నిర్మాణానికి తాము సమ్మతమేనని, ఖాళీ చేయడానికి ఏడాది సమయం కావాలని షాప్‌లవారు తేల్చిచెప్పినట్లు మర్చంట్స్ అసోసియేషన్ తెలిపింది. వారం రోజులుగా చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ యార్డ్‌లోని షాప్‌లను ఖాళీచేయాలని సూచిస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 అధికారులు గాంధీనగర్ కార్పొరేటర్‌తో మార్కెట్‌లోని షాప్‌లవారు బుధవారం అంతర్గతంగా భేటీ అయ్యారు. మార్కెట్‌లోని మహిళాభవన్‌లో సర్కిల్ డీఎంసీ రామాంజనేయులురెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తదితర అధికారులతో మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్ తదితరులు మాట్లాడారు. 9 అంతస్తుల అధునాతన భవనం నిర్మించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని 'మీరు ఖాళీ చేస్తే పనులు ప్రారంభం అవుతాయి' అని డీఎంసీ, ఏసీపీ అన్నారు. దీంతో నూతన భవన నిర్మాణానికి తాము సమ్మతమేనని ఖాళీ చేయడానికి ఏడాది సమయం కావాలని షాప్‌లవారు తేల్చిచెప్పినట్లు మర్చంట్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అశోక్ వివరించారు.

అయితే అంతసమయం ఇవ్వడంకుదరదని ఎంత సమయం ఇస్తామనేది నగర మున్సిపల్ కమిషనర్‌తో, కార్పొరేటర్‌తో మాట్లాడి వెల్లడిస్తామని అధికారులు చెప్పారని ఆయన వివరించారు. కాగా షాపుల అద్దెల బకాయిల విషయంలో సందిగ్ధత నెలకొందని, 20 ఎస్‌ఎఫ్‌టీ ఉన్న అత్యంత చిన్న షాప్‌కు 250 ఎస్‌ఎఫ్‌టీ ఉన్నట్లుగా లెక్క గట్టి అద్దె కట్టాలని సూచిస్తున్నారన్నారు. అదేవిధంగా లక్షల బిజినెస్ చేస్తున్నవారికి రూ.8లకు ఎస్‌ఎఫ్‌టీ అద్దె చొప్పున వసూలు చేస్తుండగా, గిరాకీలు లేక వెలవెలబోతున్న షాప్‌లవారికి రూ.18లకు ఎస్‌ఎఫ్‌టీ లెక్కన అద్దె వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పది సంవత్సరాలకు లక్షల్లో బకాయిలు కనిపిస్తాయని, ఈ తప్పులు సరిదిద్దాలని మర్చంట్స్ అసోసియేషన్ పక్షాన కోరామన్నారు. ఈ విషయంలో సమస్య పరిష్కారానికి డీఎంసీ సానుకూలంగా స్పందించారని అశోక్ వెల్లడించారు.

వాలీబాల్ గ్రౌండ్ పనులను పూర్తిచేయాలి

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన వాలీబాల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌ను జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఆశాలత, డీఈలు సన్నీ, గీతాకుమారి, ఏఈ మురళీతో కలిసి కార్పొరేటర్ నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఫిర్యాదు చేశారు. గ్రౌండ్‌లో సిట్టింగ్ గ్యాలరీ, ప్రహరీ, ఓపెన్‌జిమ్ పనులను వేగవంతం చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, పార్టీ నాయకులు అనిల్ కుమార్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌కు సన్మానం



రాష్ట్ర మంత్రిగా నియమితులైన గడ్డం వివేక్‌ను సన్మానిస్తున్న దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, కార్యదర్శి చిరంజీవి, ప్రతినిధులు వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్ తదితరులు - రాంనగర్

దళిత సేన ఆధ్వర్యంలో



రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాకప్పి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర దళిత సేన అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డి మల్ల పార్వతి, సభ్యులు తదితరులు - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం



టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అచ్యుత రమేష్‌బాబు బుధవారం టీ పీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. - రాంనగర్

అంజన్‌కుమార్‌యాదవ్‌కు సన్మానం



టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియమితులైన జి.నాగభూషణం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను బుధవారం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. - రాంనగర్

మంచినీటి లోప్రెషర్ సమస్య పరిష్కరించాలి



లోప్రెషర్ సమస్యను ఎండీ అశోక్‌రెడ్డికి వివరిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో నల్లాల్లో తాగునీటి సరఫరాలో లోప్రెషర్‌సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ పావని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో లోప్రెషర్ సమస్యతో ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. బుధవారం ఎండీని ఆయన కార్యాలయంలో కలిసిన కార్పొరేటర్ లోప్రెషర్ సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహణ!

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆస్పత్రిపై దాడిచేసిన ముషీరాబాద్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇద్దరు కలిసి ముషీరాబాద్ జమిస్తాన్‌పూర్‌లో ఓ క్లినిక్‌ను నిర్వహిస్తోంది. వచ్చిన రోగులకు అల్లోపతి మందులు ఇస్తూ వైద్యం చేస్తున్న వీరిపై ఫిర్యాదు వచ్చింది. దీంతో ముషీరాబాద్ పోలీసులు క్లినిక్‌పై దాడి చేశారు. అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నామని, మరోనిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం అదింది. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆయన ఆచూకీ కోసం తెలిసిన వారు వెంటనే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు గానీ లేదా ఎస్ఐ నెంబర్ 98495 63715లో సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ డ్రైవర్ మృతి

బర్కత్‌పుర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని జీహెచ్‌ఎంసీ డ్రైవర్ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్‌లో నివాసం ఉంటున్న కావలి శేఖర్(30) జీహెచ్‌ఎంసీలో డ్రైవర్. బుధవారం బుద్వేల్ - ఉందానగర్ రైల్వే స్టేషన్ల నడుమ పట్టాలు దాటుతుండగతా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.